పీడీఎస్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - నెల్లిమర్ల : మండలంలోని బుచ్చన్నపేట జంక్షన్లో ఉన్న కుర్మాన కమల ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల(19 బ్యాగులు) పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం పట్టు కున్నారు. వారికి అందిన సమాచారం మేరకు ఆ విభాగం ఎస్సై రామారావు తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. పట్టుబడిన బియ్యాన్ని బొప్పడాం రేషన్ డీలర్కు అప్పగించినట్లు సీఎస్ డీటీ శంకరరావు తెలిపారు. సదరు వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రజలకు నష్టం కలిగే పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందే..

కాలువ నిర్వాసిత రైతులు ఆందోళన

విశాలాంధ్ర - వేపాడ : వ్యవసాయ రైతులకు నష్టం వాటిల్లే పోలవరం ఎడం కాలువ డిజైన్ మార్చాల్సిందేనని రైతులు రైతుల పోరాట కన్వీనర్ చల్లా జగన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సోమవారం నిర్వాసితులతో కొండగుళ్ళ వద్ద పోలవరం ఎడమ కాలువ నిర్వాసిత రైతుల పోరాట కన్వీనర్ చల్లా జగన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ పోలవరం డిజైన్ వల్ల వేలాది రైతులు నష్టపోయి నిరాశ్రయులు అవుతున్నారన్నారు అడ్డదిడ్డంగా ఉన్న డిజైన్ వెంటనే మార్చాలని, 2013 చట్టం అమలు చేయాలని, పూర్తిగా భూమి కోల్పోయిన రైతులకు భూములకు బదులు భూమి ఇవ్వాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలవాలని కోరారు.రైతుల డిమాండ్ మేరకు జిల్లా కలెక్టర్ గ్రామసభలు నిర్వహిస్తే అన్ని గ్రామసభల్లో డిజైన్ మార్చాలని అన్ని పంచాయతీలలో ఏకవాక్య తీర్మానం చేశారన్నారు. ఆ గ్రామసభల తీర్మానాన్ని అధికారులు,ప్రభుత్వం ఎంతవరకు పరిగణలో తీసుకున్నారో జిల్లా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. రైతుల సాగునీటి అవసరం కోసమని 2007లో తయారుచేసిన ప్రాజెక్ట్ రూపకల్పనకి, ఇప్పటికీ భూమి స్థితికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఈ సుజల ప్రవంతి పరిధిలో ఉన్న భూములకి ఇప్పటికే తోటపల్లి, పెద్దగడ్డ, ఆంధ్ర గజపతినగరం బ్రాంచ్ కెనల్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న భూములు కలిసి ఉన్నాయని అన్నారు. ఇప్పటికే కొన్ని భూములు తోటలగాను మరికొన్ని భూములు రియల్ ఎస్టేట్ గాను మారి పోయన్నారు. అంత పెద్ద సైజు కాలువ నిర్మాణం చేపట్టిన అవసరం లేదన్నారు. ప్రభుత్వంనిజంగా రైతులకు సాగునీరు అందించాలని ఉంటే రైవాడా తాటిపూడి నీరు రైతులకి ఇచ్చి పోలవరం కాలువ నీరు విశాఖ వాసులకు, పారిశ్రామిక వాసులకు ఇచ్చి ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా వేలాది మంది రైతుల నిరశ్రాయుల అవకుండా చేయవచ్చన్నారు.ఈసమావేశంలో పోరాట కమిటీ జిల్లా నాయకులు రౌతు బాబురావు, మజ్జి శ్రీను,ఎం.అర్జునరావు, వేపాడ సర్పంచ్ మొలిపాక రమణ, ఏడు వాక అప్పలనాయుడు సిరికి నాయుడుబాబు భూసర్ల నారాయణ మూర్తి, పాత్రుడు, అదపరెడ్డి అప్పారావు నిరుజోగి కృష్ణ అదపరెడ్డి రమణ పాల్గొన్నారు.

కాపాలు మాస్టారు సేవలు చిరస్మరణీయం..

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి వినాయకనగర్ కు చెందిన దివంగత పెంట కాపాలు మాస్టారు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. కాపాలు మాస్టారు ప్రధమ వర్ధంతి సందర్భంగా స్తానిక ఎఫ్.టి.ఏ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఆయన కుటుంభ సభ్యులు సోమవారం 45మంది నిరుపేద ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంట రమేష్, పెంట రవి, ట్రస్ట్ చైర్మన్ హరికుమార్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, రమణ, ట్రస్ట్ సభ్యులు శ్రావణ్ కుమార్, గోవిందరావు, నగేష్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్

విశాలాంధ్ర - బొబ్బిలి : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ పెద్దలు రాష్ట్రంలో ఉన్నటువంటి 1 లక్ష 65 వేలమంది వాలంటీర్లకు ప్రస్తుతం ఇస్తున్న5వేల రూపా యలు వేతనాన్ని పదివేల రూపాయలు గౌరవ వేతనంగా ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని తుంగలో తొక్కారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న కూటమి ప్రభుత్వం తీరు పై మండి పడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లందరికి న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు నమ్మి రాష్ట్రంలో 1 లక్షా 65 వేల మంది రాజీనామాలు చేయకుండా ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్న వాలంటీర్లుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. 5వేల రూపాయలు జీతం పదివేల రూపాయలకు పెంచుతామని కూటమి నేతలు చెప్పడంతో ఎంతో ఆశపడి కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీని ఇచ్చారని సందర్భంగా గుర్తు చేశారు. వాలంటీర్లను ప్రభుత్వం నిర్వీర్యం చేయడం వలన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఎటువంటి జీవనోపాధి లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థపై రాజకీయాలు పక్కన పెట్టి వారికి సాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అర్గనైజింగ్ కార్యదర్శి బి తులసీరామ్ పాల్గొన్నారు

రాజాంలో ఉన్న వీధివిక్రయదారుల సమస్యలను పరిష్కరించండి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : రాజాంలో ఉన్న వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజాం నగర పంచాయతీలో దళిత వర్గానికి చెందిన వీధి వ్యాపారస్తులు 45 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నారని వీరికి ఎటువంటి ముందస్తు నోటీసు జారీ చేయకుండా ఫిబ్రవరి 3న వీరందరిని తొలగించమని అనడం అన్యాయం అన్నారు. చట్టం నిర్ణయించిన ప్రకారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో చట్టం ప్రకారం ఎన్నికల ద్వారా నిర్ణయించకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం కేవలం రాజకీయ నాయకులకు, బడా వ్యాపారస్తులకు కొమ్ము కాయడమేనన్నారు. దీనివల్ల వీధి విక్రయదారులకు జీవనోపాధి లేకుండా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తొలగించిన వీధి విక్రయదారులను ప్రభుత్వం జారీ చేసిన వీధి విక్రయదారుల చట్టం ప్రకారం యధా స్థానంలో పునర్నిర్మాణం చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో వీధి విక్రదారులు పాల్గొన్నారు

పన్ను చెల్లింపుదారులలో అనూహ్య స్పందన

విశాలాంధ్ర - విజయనగరం : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను చెల్లిం పులకు ఐదు శాతం రాయితీని ప్రక టించ డంతో పన్ను చెల్లింపుదారులలో అనూహ్య స్పందన కనిపిస్తోంది. ఈ మేరకు సోమవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 2 ప్రత్యేక కౌంటర్లు వద్ద భారీగా ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ పన్నులను చెల్లిస్తున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను మొత్తాన్ని ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే ప్రభుత్వం ఐదు శాతం రాయితీని ప్రకటించిందన్నారు. ఈ విషయమై విస్తృత ప్రచారాన్ని కల్పించామన్నారు. ప్రజలకు వివరంగా తెలియపరిచే ప్రకటనలను ఏర్పాటు చేశామన్నారు. దీంతో అధిక సంఖ్యలో చెల్లింపుదారులు కార్యాలయానికి వచ్చి పన్నులను చెల్లిస్తు న్నారన్నారు. అలాగే మిగిలిన వారు కూడా తక్షణమే ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నులను చెల్లించి ఐదు శాతం రాయితీ సౌకర్యాన్ని పొందాలన్నారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని వెల్లడించారు. పన్ను చెల్లింపులను ఆన్లైన్ ద్వారా కూడా చెల్లించుకునే వెసులుబాటు ఉందని చెప్పారు.

జిఆర్ఈఎఫ్ ఉద్యోగికి గౌరవవందనంతో అంత్యక్రియలు

విశాలాంధ్ర - కొత్తవలస : భారతదేశ సాయుధ దళాల బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(బిఆర్ఓ) లోని పారా మిలిటరీకి చెందిన జిఆర్ఈఎఫ్ (జనరల్ రిజర్వ్ ఇంజనీర్ ఫోర్స్) విభాగం పశ్చిమ బెంగాల్లో సుదీర్ఘకాలంగా జిఎస్-193980ఎల్, ఎంఎస్డబ్ల్యూపిఎన్ఆర్ వర్కింగ్ యూనిట్లో ఉద్యోగిగా పనిచేస్తున్న రాయపురెడ్డి దేముడు నాయుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దేముడునాయుడు స్వస్తలం విజయనగరం జిల్లా, కొత్తవలస మండలంలోని నరపాం గ్రామానికి చెందినవారని, దేముడు నాయుడు విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో పనిచేశారని, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ విభాగంలో విశేష సేవలందించారని, ఆయన మరణం దేశానికి తీరనిలోటని 87ఆర్సిసి (జిఆర్ఈఎఫ్) మేజర్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ కుమార్ జిల్లా కలక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్ కు ఓ లేఖలో తెలియజేశారు. దేముడునాయుడు మృతదేహాన్ని స్వంత గ్రామం నరపాంలోని ఆయన కుటుంభ సభ్యులకు అప్పగించారు. దేముడునాయుడు కుటుంభ సభ్యుల సహా గ్రామ మంతా శోకసంద్రమయ్యింది. మృతుడికి భార్య నాగమణి, 9ఏళ్ల హర్షవర్ధన్, 7ఏళ్ల యశ్వంత్ అనే ఇద్దరు కుమారు లున్నారు. సోమవారం నరపాం గ్రామంలో నిర్వహించిన దేముడునాయుడు అంత్యక్రియలను జిల్లాలోని రిజర్వుడ్ పోలీసులు, కొత్తవలస పోలీసుల గౌరవ వందన సమర్పణతో జరిగాయి. దేముడునాయుడు అంత్యక్రియలకు అధికసంఖ్యలో జనం హాజరయ్యారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో చేపలకంచేరులో కోలా వారి కళ్లాలు వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విధ్యుత్ సార్క్ సర్క్యూటే వల్ల మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు అంటు న్నారు. ఈ అగ్ని ప్రమాదంలో కోలా ఎల్లయ్య పురిల్లు అగ్నికి ఆహుతయిన్నది. ఈ అగ్ని ప్రమాదంలో 4 తులాలు బంగారు ఆభరణాలు, 200 తులాలు వెండి, 4 లక్షలు డబ్బులు, మహిళా మండలికి చెందిన మరో 60 వేలు కాలి పోయినట్టు బాధితులు ఆందోళన చెందుతున్నారు. వి.ఆర్.ఒ, ఆర్.ఐ వెళ్లి సంఘటన పరిశీలించారు.

సీతం కళాశాల విద్యార్థులు అక్షయపాత్ర ఫౌండేషన్ సందర్శన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక సీతం కళాశాల ఎమ్.బి.ఏ విద్యార్థిని విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా బెంగళూరుకు చెందిన అక్షయ పాత్ర ఫౌండేషన్ను సందర్శించడం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి, సంస్థకి చెందిన వినయ్ కుమార్ (సీనియర్ ఎగ్జిక్యూటివ్) మాట్లాడుతూ ప్రతి రోజు 89,000 వేల మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సప్లై చైన్ మేనేజ్మెంట్ ద్వారా అక్షయ పాత్ర సంస్థ విస్తారమైన భౌగోళిక ప్రాంతాలలో ఎలా ప్రతిరోజూ మిలియన్ల కొద్దీ భోజనాన్ని అందిస్తుందన్నారు ఇన్వెంటరీ ప్రొక్యూర్మెంట్ అనే అంశంపై మాట్లాడుతూ పదార్థాలు బల్క్లో ఎలా పొందబడుతున్నాయి, నిల్వ చేయ బడతాయి అనే అంశాలను వివరించారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ద్వారా మెరుగైన కార్యకలాపాల కోసం ఆటోమేటెడ్ కిచెన్లు, రూట్ ఆప్టిమైజేషన్, రియల్ టైమ్ ట్రాకింగ్ సిస్టమ్ల ఉపయోగ విధానాలు వివరించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మరియు డెలివరింగ్ విధానం పై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు నేటిపల్లి వృథ్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్, సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకువివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 41 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదే శించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలనిఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిసిఆర్బీ సిఐ శంకర్రావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అనురాగ్ సంస్థ ఉపకారవేతనం అందజేత

విశాలాంధ్ర - బాడంగి : స్థానిక బాడంగి జడ్పీ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు పాఠశాలలో దివ్యాంగులకు అందుతున్న సేవలను గుర్తించి హైదరాబాద్ లో గల అనురాగ్ ప్రత్యేక పాఠశాల డైరెక్టర్ డా.రామ్ ఉపకారవేతనం రూపంలో 10వేల రూపాయల చెక్కులను 10 మంది విద్యార్థులకు సంస్థ ప్రతినిధి మను.మనోజ్, హెచ్.ఎం దత్తి సత్యన్నారాయణ, చేతుల మీదుగా సోమవారం అందజేయటం జరిగింది ఈ సందర్భంగా హెచ్.ఎం మాట్లాడుతూ మా పాఠశాలలో దివ్యాంగులకు ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వ, ప్రవేటు, స్వచ్ఛంద సంస్థలు,వ్యక్తులు దివ్యాంగులకు, పాఠశాల అభివృద్ధి కనేక రకాలుగా సహాయ పడుతున్నారని అనురాగ్ సంస్థ ఉపకారావేతనం అందించటం హర్షించదగ్గ విషయమని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, దాకేటి రమేష్, మోహనరావు,శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీలో విద్యార్థులకు పతకాలు



విశాలాంధ్ర - నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన జూనియర్ కుస్తీ పోటీల్లో ఎల్ చైతన్య 44 కిలోల విభాగంలో బంగారు పతకం, ఎం రణదీప్ 48 కిలోల విభాగంలో రజత పతకం, ఎస్ రామాంజనేయులు 47 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి జ్ఞానశంకర్, పీడీ పతివాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

సీపీఎం నాయకులు శంకర్రావు

విశాలాంధ్ర - రామభద్రపురం : మండలంలో ఉన్న వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా సిపిఎం నాయకులు పొట్నూరు శంకర్రావు అన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గిరిధర్ కు వివిధ సంస్థలతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు వీఆర్ఏలు గ్రామ సేవకులను వారి సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నారని అన్నారు.10500 ప్రస్తుతం ఉన్న జీతాన్ని 26000 రూపాయలకు ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

కర్రోతు నరసింగరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : విజయనగరం విజ్జి స్టేడియంలో స్నేహితులు వాకర్స్ క్లబ్ సభ్యులందరూ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు నర్సింగ్ రావు ను ఘనంగా సన్మానించారు. ఆయనకు మాజీ కౌన్సిలర్ కిలాన మహేష్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పక్కి సంజీవరావు, మాజీ అధ్యక్షులు యస్.అచ్యుతరావు, ఎం అప్పారావు, కే.ఎం. సంజీవరావు ,కంది లక్ష్మణ్ రావు విజయ కుమార్ తదితరులు కర్రోతు నర్సింగరావు గురించి వారి సేవలు గురించి ప్రసంగించారు. వారికి అభినందనలు తెలియజేసి శాలువా కప్పి ,బోకే లతో గౌర వించారు. అనంతరం కర్రోతు నర్సింగరావు మాటా ్లడుతూ నా సహాయ సహకారాలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటాయని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి నేను రాత్రి పగలు సాయి శక్తుల కష్టపడి అభివృద్ధి చేస్తానని అన్నారు. నా శ్రమను గుర్తించి పూసపాటి అశోక్ గజపతి రాజు, శాసనసభ్యులు అదితి గజపతి రాజు సహకారం వల్లే నాకు ఈ పదవి లభించిందని గర్వంగా చెప్పుకున్నారు. వారి సన్మాన కార్యక్రమం అనంతరం కృతజ్ఞతలు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - విజయనగరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక వినతి మాత్రమే వచ్చింది. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కమిషనర్ పల్లి నల్లనయ్య హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి వినతి వచ్చింది. వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికనకు వచ్చే వినతులను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఇండియా పారా విజేతను సత్కరించిన మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : ఇండియన్ బాడీ బిల్డింగ్ మరియు ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీలలో ఒరిస్సాలోని సంబల్ పూర్ లో జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో స్టార్ విభాగంలో పారా బిల్డర్ ఈదుబిల్లి సూర్యనారాయణ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సెర్ప్ మరియు వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సూర్యనారాయణను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం మండలం వంగర గ్రామానికి చెందిన సూర్యనారాయణ జాతీయ స్థాయిలో రాణించి మెడల్స్ సాధించడం జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్ లో మరిన్ని పతకాలు సాధించి క్రీడల్లో జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. పారా క్రీడలకు సంభందించిన వివరాలను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ మంత్రికి వివరించారు. పారా క్రీడాకారులకు సహకారం అందేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

జిల్లాల వారీగా అంగన్వాడి కేంద్రాల్లో 1428 పోస్టులను భర్తీ చేస్తున్నాం

విశాలాంధ్ర - భోగాపురం : విశాఖ రీజనల్ పరిధిలో ని ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామని స్త్రీ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యా లయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విజయ నగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న1428 పోస్టులను పోస్టులను భర్తీ చేయను న్నామని తెలిపారు. ఇందులో అంగన్వాడి కార్యకర్తలు, మినీ అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ల వద్ద దస్త్రం ఆమోదం పొందిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని తెలిపారు. అలాగే మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. జిల్లా ఐసిడిఎస్ పిడి రుక్సానా బేగం, ఏసి డిపి ఓ సత్యవతి, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన-టాయిలెట్స్ ఉపయోగంపై అవగాహన

విశాలాంధ్ర -రేగిడి/రాజాం : స్థానిక జిఎమ్ఆర్ఐటి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తాటిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న 7 రోజుల ఎన్.ఎస్.ఎస్. ప్రత్యేక సేవా శిబిరము లో భాగంగా 6వ రోజు సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో బహిరంగ మల విసర్జన పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి వద్ద వున్న టాయిలెట్స్ మాత్రమే వాడాలని, బహిరంగ మలవిసర్జనను మానుకోవాలని, గ్రామ పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రపంచం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని, అయి నప్పటికీ ఈ చెడు అలవాటు గ్రామాలలో ఇంకా పోవడం లేదని దీని వలన ఎన్నో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయయని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.ఈ ఏడు రోజుల సేవా శిబిరాన్ని జిఎమ్ఆర్విఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యా ర్థులు ఉదాహరణలు గా చిన్న ఉద్యోగాలను తమ కోరికగా చెప్పగా, ప్రతి విద్యార్థి ఎంతో పెద్దగా కలలు కనాలనిలి(డ్రీం బిగ్) చెప్పారు. కష్టపడితే దేనినైనా సాధించవచ్చునని, తమ కలలను సాకరం చేసుకొని, తమ తల్లితండ్రులను చక్కగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిఎమ్ఆర్ఐటి విభాగధిపతి డా.అట్టాడ వెంకట రమణ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు గార రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె.వి.ఎస్. ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలెంటరులు తమ సేవలు అందించారు.

సమ్మేటివ్ అసెస్మెంట్ బి2 పరీక్షల పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం : సోమవారం నుండి మండలం లో గల అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల లలో జరుగు చున్న సమ్మేటివ్ అసెస్మెంట్ బి2 పరీక్షల నిర్వహణ తీరును జెడ్పి హెచ్ స్కూల్, ఉద్దవోలు యందు ఎం ఈ ఓ జే. తిర్జాధరావు పరిశీలించడం జరిగింది. ఈ పరీక్షల నిర్వహణ క్లాస్ బేస్డ్ అసెస్మెంట్ విధానంలో ఓ ఎం ఆర్ షీట్స్ వినియోగించి 1బి8 వ.తరగతి వరకు నిర్వహణ జరుగుచున్నది. 9. వ తరగతి ప్రశ్న పత్రములు ఇచ్చి సమాధానాలు వ్రాసే పద్ధతిలో పరీక్షలు నిర్వహణ జరుగుచున్నది.వీరికి ఓ ఎం ఆర్ షీట్స్ ఉండవు. పరీక్షలు ప్రతీ రోజు 1బి8 వ.తరగతులకు ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు, 9.వ.తరగతి కి 9.00 గంటల నుండి 12.15 గంటల వరకు నిర్వహణ జరుగును. పరీక్షలు నిర్వహణ నిబంధనలు ప్రకారం నిర్వహించాలని అందరూ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది అని ఎం ఈ ఓ తీర్జాదరావు తెలిపారు.

ప్రజల వద్ద నుండి వినతుల స్వీకరణ : ఎంపీపీ బంటుపల్లి

విశాలాంధ్ర - డెంకాడ : లోకం మాధవి మార్గనిర్దేశం మేరకు, వెదుల్లవలస పంచాయతీ పరిధిలోని గొడ్డుపాలెం గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకునే ఉద్దేశ్యంతో గ్రీవెన్స్ (వినతి స్వీకరణ) కార్యక్రమం సోమవారం ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆవేదనతో వెల్లడించారు. ముఖ్యంగా తాగునీటి కొరత, రహదారి పరిస్థితులు, పింఛన్లు, రేషన్ కార్డులు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, డ్రైనేజ్ సమస్యలు వంటి అనేక అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి తెలుగు దేశం నాయకులు, జనసేన పార్టీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల ప్రభుత్వ అధికారులు హాజరై ప్రజల వినతులను స్వీకరించారు. ప్రతి ఒక్క వినతిని అప్రమత్తంగా గమనించిన వారు సమస్యలపై పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శాసనసభ్యురాలు లోకం మాధవి ప్రజల అవసరాలను గమనిస్తూ, వారికి మరింత సమర్థవంతంగా ప్రభుత్వ సేవలను అందించేందుకు ఇలా గ్రామాల స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించిన దాని ఫలితంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ తరహా వినతి కార్యక్రమాలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అధికారుల దృష్టికి తేవడానికి ఒక బలమైన వేదికగా నిలుస్తాయని, గ్రామ స్థాయిలో అభివృద్ధికి దోహదపడతాయని అధికారులు మరియు స్థానిక నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, సమస్యలను పట్టించుకుని పరిష్కార మార్గాలను ప్రణాళికబద్ధంగా అమలు చేస్తున్నందుకు ఎమ్మెల్యే గారి పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, కోఆర్డినేటర్ పైలా శంకర్, టీడీపీ మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, జనసేన నాయకులు పాలు శ్రీను, వెదుల్లవలస జనసేన నాయకులు, పంచాయతీ నాయకులు భూతళ రాము నాయుడు, మినాపు శ్రీరామ్, మినాపు నాగరాజు, వెదుల్లవలస ఎంపీటీసీ విసినిగిరి ఆచూం నాయుడు, టీడీపీ నాయకులు కలిశెట్టి గోపి, జగ్గాపాలి సూర్యనారాయణ పాత్రుడు, మినాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మన గ్రోమోర్, కోరమండల్‌లో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మన గ్రో మోర్ కోరమండల్ సంస్థ గజపతినగరం, సాలూరు, ఎస్.కోట, పూసపాటిరేగ, లక్కిడం బ్రాంచీలలో అకౌంటెంట్ లు, ఫీల్డ్ ఆఫీసర్, విభాగాలు యందు పనిచేయుటకు సిబ్బంది కావాలని విజయ నగరం జిల్లా గ్రోమోర్ సంస్థ మేనేజర్స్ మహేష్ మరియు సంతోష్ తెలియజేశారు. ఈ ఉద్యోగాల కొరకు బీఎస్సీ డిప్లమో లేదా ఏమైనా డిగ్రీ గాని ఇంట ర్మీడియట్ గాని ఉత్తీర్ణత అయి ఉండాలని ఏ విధమైన పని అనుభవం లేకపోయినప్పటికీ ఉద్యోగంలో చేరిక అవకాశం ఉంటుందని తెలియ జేశారు కావున నిరుద్యోగ యువత ఈ యొక్క అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరడం జరిగింది మరిన్ని వివరములు కొరకు 98 66 55 93 58 ,9959022110 నెంబర్ను సంప్రదించవచ్చునని తెలియజేశారు.

అనుమతులు లేకుండా క్వారీ పనులు నిర్వహణపై దర్యాప్తు...విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీలో సర్వే నెంబర్ 6లో గల రాతి క్వారీలో అసలేం జరుగుతోంది.ఒక ప్రాణాన్ని బలిగొన్న పాపం ఎవరిది. అనుమతులు లేకుండా పనులు ఎలా నిర్వహిస్తారు.మైనింగ్ శాఖ పోలీస్ అధికారులు ఏం చేస్తున్నారు.అని శీర్షికన విశాలాంధ్ర దినపత్రికలో సోమవారం వెలువడిన వార్త కథనానికి స్పందించిన మైనింగ్ శాఖ పోలీస్ అధికారులు సోమవారం వీలుపర్తి పంచాయతీలోని సర్వే నెంబరు 6లో గల శ్రీ గణేష్ సాయి మినరల్స్ క్వారీలో అలాగే రాతి క్రషర్ లను సోమవారం జిల్లా మైనింగ్ శాఖ అధికారులు టి.ఏ శ్రీనివాస్ రావు, వేపాడ మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామలక్ష్మి, వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి, సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ దర్యాప్తు చేపట్టగా శ్రీ సాయి గణేష్ రాతి క్రషర్ అండ్ క్వారీ యజమాని చెరుకూరి శ్రీనివాసరావు క్రషర్ లో ఉండగా క్వారీ తవ్వకంపై అలాగే మృతుడు చింతల సత్తిబాబు విషయమై ఆరా తీయగా,క్రషర్ అండ్ క్వారీ యజమాని చెరుకూరి శ్రీనివాసరావు క్వారీ పనులు నిర్వహించలేదని చనిపోయిన వ్యక్తి ఆరోజు రాత్రి క్వారీ గుట్ట పైనుంచి కాలుజారి పడి కాదని పనిచేసే కార్మికులు నివాసం ఉంటున్న సమీపంలో ఆని సమాధినివ్వగా క్వారీకి ఈసీలు గాని తవ్వకమునకు గాని అనుమతులు లేకుండా పనులు చేయడమేమంటేని మైనింగ్ శాఖ అధికారులు నిలదీయగా ఏటువంటి పనులు చేయలేదని చెప్పగా ఆరోజు జరిగిన సంఘటన సమయంలో అప్పుడు వున్న వ్యక్తులను పని సిబ్బందిని రేపటికి అనగా మంగళవారం నాటికి అందర్నీ తీసుకురావాలని సిబ్బంది ఆదేశించి వేను తిరిగినట్లు తెలిసింది. ఈ విషయమై మైనింగ్ శాఖ సిబ్బంది శ్రీనివాసును ఫోన్లో వివరణ కోరగా : - రాతి క్వారీకి ఈసీలు గాని అనుమతులు గాని ఇంకా మంజూరు చేయలేదని అక్కడ జరిగిన సంఘటనకు సంబంధించి సంఘటన రోజు ఉన్న వ్యక్తులు ఎవరు లేకపోవడంతో మంగళవారం అందరిని పిలిపించాలని చెప్పడం జరిగిందని తేలిపారు.

ఘనంగా శ్రీసీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం

విశాలాంధ్ర - నెల్లిమర్ల : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు దేవస్థానంలో స్వామి వారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా వేకువ జామున 5 గంటల నుంచి స్వామి వారికి ఆరాధన, బాలభోగం, ఆరగింపు, మంగళా శాసనం, తీర్థగోష్టి తదితర కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. 9 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా జరిపించారు. 10 గంటలకు కన్నుల పండువగా రామచంద్ర ప్రభువుకు పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఋత్విక్కులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. 11.30 గంటలకు రాజభోగం నివేదన, మంగశాసనం జరిపించారు. సోమవారం నాటితో దేవస్థానంలో కల్యాణ వసంతోత్సవాలు ముగిశాయి. ఆలయ ఈఓ వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయి రామాచార్యులు, మల్లికార్జున శర్మ, నరసింహాచార్యులు, కిరణ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొఠియా గిరిజన గ్రామాల్లో పర్యటిస్తాం.. భద్రత కల్పించండి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా పరిధిలోని 21 గ్రామాల్లో ఆందోళన చెందుతున్న గిరిజనులకి మద్దతుగా తాము పర్యటించనున్నామని మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీ, తమకు భద్రత కల్పించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఎస్పీ ఎస్.వి. దామోదర రెడ్డి,కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్‌లను కోరారు సోమవారం మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీ లను కలసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగం లోని కొఠియా పంచాయతీల 21 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ రోడ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మించిన అంగన్వాడీ భవనాలను కూల్చివేసి ఇప్పుడు దిగువ సెంబి వద్ద పవర్ ప్రాజెక్టుని నిర్మిస్తుందని దీనిని అడ్డుకొని గిరిజనులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మౌనం గా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు, గతంలో జరిగిన పరిణామాల పై లోక్ సత్తాపార్టీ గిరిజనులకు అండగా నిలిచిందని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గోబ్యాక్ ఆంధ్ర పోలీస్ అన్నప్పుడు కూడా లోక్ సత్తాపార్టీ ఆందోళన చేపట్టిందని, ఒడిశా ప్రభుత్వం చేస్తున్న పనులకు అమాయక గిరిజనులు ఆందోళన చెందుతున్నారని,మన రెవెన్యూ అధికారులను,వైద్య ఆరోగ్య శాఖ అధికారులను,ఫారెస్టు అధికారులను 108 వాహనాలను కూడా ఒడిశా అధికారులు, పోలీసులు వివాదాస్పద గ్రామాల్లో కి రానివ్వకపోయినా ప్రభుత్వం లో చలనం లేదని ఆరోపించారు, మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివాదాస్పద గ్రామాల్లో వెంటనే పర్యటించి గిరిజనులకి భరోసా ఇవ్వాలని భీశెట్టి కోరారు,ఎస్పీ, కలెక్టర్ ని కలిసిన వారిలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,కార్యదర్శి తుమ్మగంటి రాంమోహన్ రావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గొర్లె సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - రామభద్రపురం : మండల కేంద్రంలో శ్రీరాంనగర్ కాలనీలో నూత నంగా నిర్మించిన అంగన్వాడి 1వ కేంద్రాన్ని శాసనసభ్యులు బేబీ నాయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి ప్రభుత్వమని కొనియాడారు. కేంద్రాల ద్వారా పిల్లలకు మంచి పౌష్టికాహారము అందివ్వాలని అన్నారు. అలాగే పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి విద్యార్థుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సాలూరు రోడ్ లో ఊరికి చివర ఉన్న కోనేరు ఆధునీకరణకు శంకుస్థాపన చేశారు. అలాగే పశువుల ఆసుపత్రి వద్ద నీటి తొట్టెకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు విజయభాస్కర్, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, మండల ప్రాదేశిక సభ్యులు చంద్ర తిరుపతిరావు తాసిల్దార్ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే పిజిఆర్ఎస్ ధ్యేయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక-పిజిఆర్ఎస్‌లో పాల్గొని మంత్రి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ సక్రమమైన పాలననందించాలనే ఉద్దేశ్యం తోనే ప్రజా ప్రతినిధులు కూడా పిజిఆర్ఎస్‌లో పాల్గొని వినతులను పరిశీలించాలని, పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగానే పిజిఆర్ఎస్ లో పాల్గొంటున్నామని, ప్రతి అర్జీకి సరైన పరిష్కారం చూపించి, అర్జీ దారు సంతృప్తి చెందేలా రెడ్రస్సల్ చేయడం జరుగుతోందని అన్నారు. ప్రతి నెల వినతుల పై ముఖ్య మంత్రి సమీక్షిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. గతం లో ఎక్కువగా రెవిన్యూ సమస్యలే వచ్చేవని, రెవిన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరించడం తో ఆ వినతులు కొంత మేరకు తగ్గాయని, వ్యవసాయ, సాగునీరు, గ్రామ స్థాయి సమస్యలు ప్రస్తుతం ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 187 వినతులు అందాయి. మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ , జేసి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి , డిప్యూటీ కలెక్టర్లు మురళీ , ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 187 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధి.కంగా 88 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 08 , విద్యుత్ శాఖకు 05 , హౌసింగ్ కు 04 , పంచాయతి కు 19 , పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 17 , వినతులు అందాయి. విద్యా శాఖకు 05 , సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు 12 అందగా , వైద్య శాఖకు 04 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

పొలాలకు దారి చూపించాలని వినతి

విశాలాంధ్ర - రామభద్రపురం : మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న పొలా లకు దారి చూపించాలని రామభద్రపురం గ్రామానికి చెందిన రైతులు తాసిల్దార్ సులోచనారానికి సోమ వారము దారి కొరకు వింత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు వంగపండు సూర్యనారాయణ మాట్లా డుతూ గతంలో ఈ పొలానికి రహదారి సౌక ర్యం ఉండేదని అన్నారు. రెవెన్యూ వారు పరిశీలించి పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంగపండు తిరుపతి, కొల్లి అప్పలనాయుడు, రవికుమార్‌లో పాల్గొన్నారు.

ప్రకృతిసాగులో పండించిన కూరలు, చిరుధాన్యాలతో ప్రయోజనం

విశాలాంధ్ర - కొత్తవలస : ప్రకృతి వ్యవసాయ సాగులో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, వేరుశెనగ కాయలు, ఉల్లిపాయలు, పొదవుచిక్కుడు, పెసలు, కొర్రలు, మినుము, రాగులు, సజ్జలు వంటి చిరు ధాన్యాలను తినడం వలన మానవాళికి అనేక ప్రయోజనాలున్నాయని కొత్తవలస ఏపిఎం(ఎఫ్.పి.ఓ) ఏ.వెంకటరమణ తెలిపారు. కొత్తవలస %ఖీరా% ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంవద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ స్టాల్ ఏర్పాటుచేశారు. దేవాడ, వియ్యంపేట గ్రామాల రైతు సంఘాల సభ్యులు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన అధికారులకు, ప్రజలకు స్టాల్లోని ఆకు కూరలు, కాయకూరలను విక్రయించారు. వీటిని వాడటం వలన జీవన ప్రమాణ స్థాయి పెరిగి రోగాలు రాకుండా, మంచి ఆరోగ్యంతో ఉంటారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఉషారాణి, ప్రమీలరాణి తదితర సిబ్బంది హాజరయ్యారు.

వేసవి అపరాల సాగు, రబీ విస్తీర్ణం పెంచాలి

విశాలాంధ్ర - కంటోన్మెంట్ విజయనగరం : వ్యవసాయ అనుబంధ రంగాల్లో 12.97 శాతం ఉన్న వృద్ధి రేట్ను ఈ ఏడాది లో 16.32 శాతానికి పెంచాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయం లో ఎటువంటి చర్యలు చేపట్టాలో వ్యవసాయాధికారులు మండల వారీగా కార్యాచరణ ప్రణాళిక ను రూపొందించి పంపాలన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో వ్యవసాయ అనుబంధ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా వరి పండుతుందని, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి పెట్టాలని సూచించారు. ఏ మండలం లో ఏ ఏ పంటలకు అవకాశం ఉందొ గుర్తించి మండల వ్యవసాయాధికారులు మండల వారీగా ఏక్షన్ ప్లాన్ తయారు చేసి ఈ నెల 15 లోగా సమర్పించాలని అన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం 25 వేల ఎకరాల్లో సాగు అవుతోందని, ఈ విస్తీర్ణాన్ని కూడా పెంచాలని తెలిపారు. వేసవి అపరాల సాగు పెంచాలని, పొలం లో ఎటువంటి పంటల విరామం లేకుండా రైతు వేసేలా చూడాలని తెలిపారు. జలవనరుల సమస్య లేదని, రబీ పంటను కొంత ముందుగానే ప్లాన్ చేయాలనీ, సాగు నీటి సరఫరా కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే 2 నెలల్లో వంద శాతం సాయిల్ టెస్టింగ్ లు పూర్తి కావాలని ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశం లో సూచించారని తెలిపారు. జిల్లాలో అందుబాటులో నున్న వనరులను దృష్టి లో పెట్టుకొని వినూత్నంగా వ్యవసాయం లో ఏం చేయగలమో 15 రోజుల్లోగా మండల వారీగా రిపోర్ట్ లను అందజేయలన్నారు. ఈ సమావేశం లో ముఖ్య ప్రణాళికా అధికారి బాలాజీ, వ్యవసాయ శాఖ జే.డి. తారక రామా రావు, వ్యవసాయ శాఖ డి డి లు , ఏ.డి. లు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్ర చెరువు ఆక్రమణలు తొలగించండి

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పెరుమాలి ఎర్ర చెరువు ఆయ కట్టు రైతులు కొర గంజి. చటర్జీ, సిహెచ్ రమణమూర్తి లతో రైతులు తాసిల్దార్ జి.హేమంత్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఫిర్యాదు తీసుకున్న వెంటనే ఎమ్మార్వై, మండల సర్వేయర్, వీఆర్వోలుకు చెరువు ఆక్రమణ జెసిబి తో మార్కింగ్ చేయించారని ఆదేశాలు ఇచ్చారు. అలాగే పలు గ్రామాలనుండి వినతి పత్రాలు అందజేశారు. ఈయనతో ఎంపీడీవో రేగి రాంబాబు, హెచ్ డిటిజి సత్యనారాయణ, ఎమ్మార్వై ఎమ్మెస్ కే నాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలి

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో డాక్టర్ గోపాలక్రిష్ణ

విశాలాంధ్ర - కొత్తవలస : వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ నిరంతరం శ్రద్ధ చూపాలని వియ్యంపేట పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పిహెచ్సీ పరిధిలో సిబ్బంది, డా .బి. ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. "ఆరోగ్య కరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్ "2025 థీమ్ తో ర్యాలీ నిర్వహించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టికహారం, మంచి అలవాట్లు, మంచి నిద్ర, యోగ, వ్యాయామం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా శరీరకంగా, మానసికంగా, సామజికంగా జీవించడమే మంచి ఆరోగ్యం అని తెలిపారు. ఆరోగ్యమే - మహా భాగ్యం, ఆరోగ్యం గొప్ప బహుమతి - సంతృప్తి మంచి సంపద అని, బాగా నిద్రించు - బాగా జీవించు అని, మంచి పౌష్టి కహారం తీసుకోండి - ఆరోగ్యంగా జీవించండి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పి.హెచ్.ఎన్ జగదాంబ, హెచ్.వి పద్మావతి, ఫార్మసిస్ట్ ఆశ జ్యోతి, యు.డి.సి సురేష్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, స్టాఫ్ నర్స్ రోజా, దీప, ఎల్.టి సంతోష్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - విజయనగరం : రెవెన్యూ వసూలులో నిర్లక్ష్యం వహించిన వారి పట్ల క్రమ శిక్షణ చర్యలు తప్ప వని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను వసూలులో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యంపై తల్లులు జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - రాజాం : తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, ఆర్థికాభివృద్ధిని సాధించ గలమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పొగిరి వైద్యాధి కారిణి డాక్టర్ భార్గవి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పొగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్య కమంలో ఆరోగ్య సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లా డుతూ తల్లులు, శిశువులకు ఆరోగ్యకరమైన జీవితాన్ని కల్పించేందుకు వారిలో అవగాహన పెంచడం, చర్యలు తీసుకోవడం చాలా అవసరం అని అన్నారు. ప్రపం చంలో ఏటా లక్షలాది మహిళలు గర్భధారణ లేదా ప్రసవ సమయంలోనూ, మొదటి నెలలోనే లక్షలాది మంది పసికందులు మరణి స్తున్నారని తెలిపారు. అందుకే ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య కరమైన ఆరంభాలు, ఆశాజనక భవిష్యత్తులు అనే థీమ్ ద్వారా ప్రజలను జాగృతి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి వై.తేజస్వి, క్షేత్ర పర్యవేక్షులు నాగభూషణరావు, నారాయణమ్మ, శశికళ, రామకృష్ణ, సిబ్బంది వంశి క్రిష్ణ, దుర్గా ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ హెల్త్ డే పై ర్యాలీ : డాక్టర్ లోకప్రియ

విశాలాంధ్ర - మెంటాడ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెంటాడలో డాక్టర్ లోకప్రియ ఆధ్వర్యం లో సోమవారం ర్యాలీ కార్యక్రమంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మెంటాడ పీహెచ్ సి నుండి సంతతోట వరకు ర్యాలీలో పాల్గొని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటాడ పీహెచ్సీ డాక్టర్ లోక ప్రియ మాట్లాడుతూ ఈ సంత్సరం ఆరోగ్య కరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు అన్న నినాదముతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య మరియు ఆరోగ్య శాఖ ద్వారా వైద్య సేవా కారక్రమాలు ముఖ్యంగ క్యాన్సర్, టీబి, కుష్టు, చెక్కర వ్యాధి, బీపీ మొదలగు వ్యాధులతో పాటు దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణ మరియు నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అని తెలియజేశారు. మాత మరియు శిశు ఆరోగ్యం కోసం కూడా అనేక కారక్రమాలు నిర్వహిస్తున్నావని తెలిపారు. ఈ క్రమంలో వైద్య మరియు ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేసి వైద్య సేవలు అందించాలని కోరారు. వేసవిలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధుల నుంచి ఉపశమనం పొందడానికి మంచినీరు కొబ్బరినీరు మజ్జిగ ఓఆర్ఎస్ ఎక్కువగా తాగాలని తెలిపారు. ఈ వేసవిలో వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్సీ డాక్టర్ సంప్రదించాలి అని కోరారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండలు తీవ్రంగా ఉన్నాయని వేతన దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వయంగా ఆశ వర్కర్లు వివిధ రకాల వ్యాధులకు గురికాకుండా తెల్లటి పానీయాలను అందించాలని వైద్య అధికారులు చూపించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ సత్యనారాయణ ఎల్వి రమణ ల్యాబ్ టెక్నీషియన్ సచివాలయం ఏయన్‌యంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర -విజయనగరం : జిల్లాలో వచ్చే మార్చినాటికి గృహనిర్మాణ లక్ష్యాలను సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని హౌసింగ్ ఏఈలను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. పిఎంఏవై 2.0 కొత్త గృహాల కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 32,000 మంది లబ్దిదారులను గుర్తించడం జరిగిందని, వారికి ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదే శించారు. జిల్లాలో గృహనిర్మాణ ప్రక్రియ, కొత్త ఇళ్ల మంజూరుపై కలెక్టరేట్లో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, పిఎంఏవై (అర్బన్) 1.0 క్రింద మంజూరైన ఇళ్లలో 11,648 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయిందని, వీటిలో ఇప్పటివరకు 3,921 ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన 7727 ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవలే అదనపు సాయం క్రింద ఎస్‌సి, బిసిలకు రూ.50వేలు, ఎస్‌టిలుకు రూ.75వేలు, ఆదివాసీ గిరిజన తెగలకు రూ.లక్ష మంజూరు చేసిందని, ఈ సాయిన్ని లబ్దిదారులు అందరికీ వర్తింపజేయాలని చెప్పారు. ఇంకా మున్సిపాల్టీల్లో సుమారు 1500 మంది లబ్దిదారులు ఉన్నారని, వీరికి ఈ అదనపు సాయాన్ని అందించేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. జిల్లాలో పిఎంఏవై 2.0 క్రింద మంజూరు చేయనున్న ఇళ్ల లబ్దిదారులు సుమారు 32,000 మందిలో ఇప్పటివరకు సుమారు 2,250 మందికి పొజిషన్ సర్టిఫికేట్లను మంజూరు చేశారని, మిగిలిన వారికి కూడా మంజూరుచేసి, వీలైనంత త్వరగా వాటిని ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి పిడి జి.మురళీమోహన్, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర - దత్తిరాజేరు : కోరపు కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సంద ర్భంగా డాక్టరు కే. రఘు వైద్యాధికారి అధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు మితా హారం, సమతల ఆహారం, వ్యాయామం మరియు తగిన విశ్రాంతి తీసు కోవడం ద్వారా జీవిత కాలం ఆరోగ్యవంతంగా ఉండడానికి అవ కాశం ఉంటుందని తెలియజేసారు. ఈ కార్య క్ర మంలో డి.వీ గిరిబాబు హెల్త్ ఎడ్యుకేటర్, బి. మురళి ఎంపి హెచ్. ఈఓ, ఆర్.శ్రీనివాసరావు సూప ర్వైజర్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - డెంకాడ : పోలీస్ స్టేషన్ పరిధిలోని మోదవలస పెదతాడివాడ గ్రామాల్లో సోమవారం ఎస్సై సన్యాసినాయుడు ఆధ్వర్యంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినారు ఈ సందర్భంగా ఎస్సై సన్యాసి నాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకీల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రహదారులు కవర్ అయ్యే విధంగా ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తించే విధముగా సీసీ కెమెరాలు ఏర్పాటులో భాగంగా ఈరోజు రెండు గ్రామాలలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు, కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర - రాజాం : రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు నిమిత్తం రూ'3,500 కోట్లు బకాయిలు ఉన్నాయని నెల రోజుల ముందు నుంచే నెట్ వర్క్ ఆస్పత్రుల యాజ మాన్యాలు కూటమి ప్రభుత్వం కి నోటీసులు ఇచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని దీనిపై ఇప్పటి వరకూ 26 సార్లు లేఖలు అందినా కనీసం కూటమి ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. గత ఐదేళ్లు ప్రజారోగ్యానికి మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంపూర్ణ భరోసా ఇచ్చారని ఆరోగ్యశ్రీతో దాదాపు 45 లక్షల మందికి రూ.13 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూర్చారని ఆరోగ్య ఆసరా ద్వారా 25 లక్షల మందికి మరో రూ.1,465 కోట్లకుపైగా ఆర్థికసాయం అందించి భరోసానిచ్చారనీ, కానీ కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు.పేద ప్రజలకు అనారోగ్యం వస్తె లక్షలలో ఫీజులు చెల్లించే స్తోమత వాళ్ళకి వుండదు అని కీ.శే.డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాస్పటల్ బిల్లు 1000 రూ దాటిన ప్రతి పేద వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేసేలా ఆరోగ్య శ్రీ పథకం నీ తీసుకు వచ్చి కొన్ని లక్షల మంది పేద ప్రజల ఇళ్లలో ఆనందం నింపితే, చంద్రబాబు నాయుడు ఆరోగ్య శ్రీ పథకం నీ పూర్తిగా నిర్వీర్యం చేసి పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు బకాయిలు రూ 3500 కోట్లు చెల్లించి, పేద ప్రజలకు ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు అందేలా చేయాలని దా.తలే రాజేష్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుల, మతాలకు అతీతంగా (ఉరుసు) చందనోత్సవం

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణం గల శ్రీశ్రీశ్రీ దత్తసాయి మందిరం నందు ఉరుసు వర్షం అత్యంత వైభోగమేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవం లో భాగంగా హిందు మహమ్మదీయుల సమైక్యతాభావం పెంపోందించడం కొరకు షిరిడి పుణ్యక్షేత్రంలో షిరిడి సాయిబాబా వారు స్వయంగా శ్రీ సీతారామ కళ్యాణం, ఉరుషోత్సవంలు నిర్వహించేవారు. అలానే చీపురుపల్లి దత్తసాయి మందిరంలో ప్రతి సంవత్సరం ఈ ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. సాయి మందిర స్థలదాత శ్రీ%శ్రీశ్రీ% శే %శ్రీశ్రీ% తంగుడు రామకృష్ణ రాజు కుమారులు, మందిర నిర్మాణ దాత శ్రీ కుందుం, విద్యాసాగర్ ఆలోచన మేరకు కార్యనిర్వాహకులు రామకృష్ణ, ప్రధాన అర్చకులు బి.హెచ్. మూర్తి శర్మ,, వి.వి. రవి శర్మ, పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం ఘనంగా ఉరుసు మహోత్సవం ప్రారంభమైంది ఆహ్వా నితులు ఆహ్వానం మేరకు పాల్గొన్న విజయనగరం జిల్లా వైస్సార్సీపీ ప్రచార విభాగం అధ్యక్షులు జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అతని వెంట కార్యనిర్వకులు తంగుడు రామకృష్ణ, మొండేటి శ్రీను, ప్రభాత్ కుమార్, ప్రధాన అర్చకులు బి.హెచ్. మూర్తి శర్మ,, వి.వి. రవి శర్మ, రాజమండ్రి ముస్లిం సోదరులు వారిచే (ఉరుసు) జాహిర్ చందనోత్సవం గుర్రం పై స్వామి వారికీ చందనోత్సవ చేయుటకు భక్తులునుండి చందన స్వీకరించుటకు మరియు మేళతాళాలుతో స్వామివారిని పల్లకి మోసి ఊరేగింపు రుంకానవీధి, గాంధీ జంక్షన్, మెయిన్ రోడ్ మీదగా గవిడి వీధి మీదగా ఆలయం నకు చేరుకొని సాయిబాబా వారికి చందన పూయ కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా వలిరెడ్డి మాట్లాడుతూ ఉరుసు అనగా ప్రముఖ మహమ్మదీయ మహోత్ముల సమాధుల వద్ద జరుపుకునే ఆరాధన ఉత్సవం ప్రముఖ షిరిడి క్షేత్రంలో జరుపుకునే విధంగా మన దత్త సాయి మందిరంలో ప్రతి సంవత్సరం శ్రీ సీతారాముల కళ్యాణం, ఉరుసు ఉత్సవంలు జరుపు కుంటు న్నాము అన్నారు ముస్లిం సాంప్రదాయ సిద్ధంగా జరిగే ఉరుసు (జాహిర్) చందనోత్సవం ఊరేగింపులో పాల్గొన్నడం అదృష్టం గా భావిస్తున్నాం అన్నారు కుల మత రహితంగా హిందూ - ముస్లిం సాంప్రదాయ మేళవింపులతో నిర్వహించు చందనోత్సమునకు స్వామివారికి చందనాన్ని సాయినాథుని సమర్పించి భక్తుల ఆనందాన్ని పొందారు అన్నారు. ఈ కార్యక్రమం లో వైస్సార్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, మొండేటి శ్రీను, ప్రభాత్ కుమార్, దబ్బాడ ఆనంద్, పొడుమిటివలస గణేష్, వెంకీ, మందిర సేవకులు మీసాల శాంతరావు, వెంకటరావు, ఇజ్జిరోతు గణేష్, రుంకాన రామారావు, రాంబాబు, అమర్నాథ్ సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండండి

విశాలాంధ్ర - మెరకముడిదం : మండలంలోని బుదరాయ వలస ఎస్ఐ లోకేష్ కుమార్ సిబ్బందితోపాటు శ్యామయ్య వలస గ్రామంలో సంకల్పం యాంటీ డ్రగ్ అవేర్నెస్ మీటింగ్ కండక్ట్ చేయడం జరిగింది. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు ఏ విధంగా నాశనం అవుతుంది, సరదాగా ప్రారంభించిన అలవాట్లు విద్యార్థుల భవిష్యత్తుపై ఏవిధంగా చెడు ప్రభావాన్ని చూపిస్తుంది అన్న విష యాలను అర్థమయ్యే రీతిలో గ్రామస్తులకు తెలియజేయడ మైనది. అలాగే ప్రస్తుత తరణంలో జరుగుతున్న సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం అయినది, మరియు రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా అందరూ కూడా హెల్మెట్లు వినియోగించాలని తెలియజేయడమైనది.గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు తెలియజేయడమైనది, సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల జరిగే మంచిని గ్రామస్తులకు తెలియజేయడమైనది.